క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో నేడు(శనివారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రయాణికులు సలహాలు, సూచనలు చేసేందుకు 9959226308ను సంప్రదించాలని కోరారు.

ఈద్గా నూతన కమిటీ ఎన్నిక



సయ్యద్ అజీమొద్దీన్



ఇలియాస్ పటేల్

దేవరకొండ : పట్టణంలోని ఈద్గా, ఈద్గా కాంప్లెక్స్ మక్కా మజీద్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు శుక్రవారం కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడిగా సయ్యద్ అజీమొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.ఇలియాస్‌పటేల్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ.షబ్బీర్ అహమ్మద్, ఉపాధ్యక్షులుగా ఖదీర్, జాఫర్, షబ్బీర్, కార్యదర్శులుగా జామిన్‌అలీ, షేక్ బురాన్, షేక్ ఇలియాస్ బాబా, సహాయ కార్యదర్శులుగా ఎండీ.ఖాజా, ఖైసర్, అబ్రోజ్‌తో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రక్త నమూనాల సేకరణ



విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

పెద్దవూర : మండల కేంద్రంలోని శాంతినికేతన్ గురుకుల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే, ఫైలేరియా సర్వేలో భాగంగా పాఠశాలలోని ఒకటి, రెండో తరగతి విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నద్ది ఆంజనేయులు, సీహెచ్‌ఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు స్లీవమ్మ, స్టెల్లా, ఏఎన్‌ఎం వెంకటమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుత్తాపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ : శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం ఆనాడు పార్లమెంట్‌లో పోరాడిన గుత్తా సుఖేందర్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు పట్టణంలో తిరగరని హెచ్చరించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్, నాయకులు మన్నెం లింగారెడ్డి, ఖాదర్, మగ్దూంపాషా, అమృతం సత్యం, గోవింద్‌రెడ్డి, సైదిరెడ్డి, కోటయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గిరిబాబు, సీఐ సురేష్, ఎస్‌ఐ సైదులు

డిండి : మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం దేవరకొండ డీఎస్పీ గిరిబాబు పరిశీలించారు. మండలంలో బొగ్గులదొన, ప్రతాప్‌నగర్ కేంద్రాలను పరిశీలించి అక్కడి సమస్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని డిండి ప్రాజెక్టు, బాపన్‌కుంట చెరువును గణేష్ నిమజ్జన ప్రాంతాలుగా గుర్తించి ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల రూరల్ సీఐ సురేష్, ఎస్‌ఐ సైదులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులున్నారు.

28న అరుణాచలంకు ప్రత్యేక బస్ సర్వీస్

మిర్యాలగూడ టౌన్ : తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదర్శనకు మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 28న ప్రత్యేక బస్ సర్వీస్ నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ శుక్రవారం తెలిపారు. అరుణాచలేశ్వరస్వామి గిరి ప్రదర్శనకు ప్రతి పౌర్ణమికి బస్సులు నడిపిస్తున్నట్లు, ఈనెల 28న ఉదయం 8గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు డిపో నుంచి బయలుదేరి కాణిపాక వినాయక దర్శనంతో అరుణాచలం చేరుకొని గిరి ప్రదర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో వేలూరి గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకొని 30న మిర్యాలగూడకు చేరుకుంటుందన్నారు. ఆసక్తి గల ప్రయాణికులు రూ.3500 చెల్లించి రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 9959226308, 9492179462, 900063425, 9441703008ను సంప్రదించాలన్నారు.

నిలిచిన మధ్యాహ్న భోజనం

- మూడు రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు
- సకాలంలో అందని బిల్లులు.. చాలీచాలనీ గౌరవ వేతనం
- పాఠశాలకు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్న విద్యార్థులు



కొండమల్లేపల్లిలో మధ్యాహ్న భోజనం లేక ఆటోలో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కొండమల్లేపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు మూడు రోజులుగా సమ్మె చేస్తుండడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్న భోజనం నిలిచిపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇంటిముఖం పడుతుండగా, మరికొందరు ఇంటి నుంచి టిఫిన్‌బాక్స్‌లలో తెచ్చుకున్న భోజనం పాఠశాలల్లో తింటున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం కోసం బడి మానేసి తాము వచ్చిన ఆటోల్లోనే ఇంటికి వెళ్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గిట్టుబాటు ధర కల్పించాలని, నాలుగు నెలల నుంచి సక్రమంగా బిల్లులు రాక పెండింగ్‌లో ఉండడంతోనే సమ్మెకు దిగారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్న సమయంలో భోజనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో పాటు విద్యార్థుల హాజరు శాతం కూడా తగ్గుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాలని సూచించాం

రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, వంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని సమ్మె చేస్తున్నారు. దీంతో రెండు రోజులు వారిని బతిమాలి మధ్యాహ్న భోజనం వండించి విద్యార్థులకు అందించాం. నిన్నటి నుంచి మధ్యాహ్న భోజనం వండడం కుదరదని వారు చెప్పడంతో విద్యార్థులను ఇంటి వద్ద నుంచే మధ్యాహ్న భోజనం తెచ్చుకోవాలని సూచించాం.

– సీహెచ్.శ్రీనివాస్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, కొండమల్లేపల్లి జెడ్పీహెచ్‌ఎస్

సెల్ఫీ విత్ గణేశ్



దేవరకొండ మండలంలోని పడమటపల్లిలో ఇంట్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మస్న రిత్విక్



మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న గంధం లీలారాణి తదితరులు

సీజ్ చేసిన బోరు వినియోగిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలి

మాడుగులపల్లి : వాల్టా చట్టం ప్రకారం అధికారులు సీజ్ చేసిన బోరును తిరిగి వినియోగంలోకి తెచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన రైతు ఆవుల బుచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన బోరు వెంటే పక్క పొలం రైతు గతంలో బోరు వేయడంతో అధికారులు పరిశీలించి సీజ్ చేశారని, సీజ్ చేసిన బోరును ఇటీవల తిరిగి ఆ వ్యక్తి వినియోగంలోకి తేవడంతో తన బోరు నీళ్లు పోయక పొలం ఎండిపోతుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

బీఆర్‌ఎస్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలి

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన సుమారు 50మంది వివిధ పార్టీల నాయకులు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లోకసాని తిరుపతయ్య, జెడ్పీటీసీ బాలు, ముక్కమళ్ల బాలయ్య, కొండల్‌రెడ్డి, కేశవులు, పాష, తదితరులున్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనుముల పాండమ్మ

త్రిపురారం : మండలంలోని సమస్యలపై అధికారులు బాధ్యతగా పనిచేయాలని, అరకొర సమాచారంతో సమావేశానికి రావొద్దని ఎంపీపీ అనుముల పాండమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అనుముల పాండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వ్యవసాయానికి సాగు నీరు రాకపోవడంతో రైతులు మోటార్లు, బావులపై ఆధారపడి వరి సాగు చేస్తున్నారని, విద్యుత్ సక్రమంగా అందే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉండాలన్నారు. అనంతరం సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరయ్యారు. సమావేశంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, జెడ్పీటీసీ ధనావత్ భారతి, తహసీల్దార్ గాజుల ప్రమీల, వైస్ ఎంపీపీ మట్టయ్య, త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, తాటి శ్రీనివాస్, భిక్షంరాజ్, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మండలంగా ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్సీ కోటిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో 12 గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డికి శుక్రవారం మిర్యాలగూడెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. పులిచర్లను నూతన మండలంగా ఏర్పాటు చేస్తే పెద్దవూర, పీఏపల్లి మండలాలకు చెందిన 15గ్రామపంచాయతీలకు అనుకూలంగా ఉంటుందని, పులిచర్లలో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని వినతిలో వివరించారు. మండల ఏర్పాటు అయ్యేలా తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను సుందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, లక్ష్మయ్య, వెంకటయ్య, చెన్నారెడ్డి, రవినాయక్, కిషన్ నాయక్, ఎల్లయ్యగౌడ్, చిరంజీవి, సత్యనారాయణ, నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, పాషా, నాగరాజు, శ్రీనివాస్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

అడవిదేవులపల్లి : సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మండలంలోని బంగారికుంట తండాకు చెందిన విజయలక్ష్మికి మంజూరైన రూ.38వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్, మొల్కచర్ల ఎంపీటీసీ కుర్ర కృష్ణకాంత్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీను తదితరులున్నారు.

సమ్మెను అణిచివేయాలని చూస్తున్న ప్రభుత్వం



హాలియా : సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి



మిర్యాలగూడ టౌన్ : సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఇంద్రవెల్లి కవిత

హాలియా : అంగన్‌వాడీలు, ఆయాలు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే పాలక ప్రభుత్వం కుట్రలు చేసి నిర్బంధాలు ప్రయోగిస్తూ సమ్మెను అణిచివేయాలని చూస్తుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హాలియాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. ఈ సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. చాలీచాలని జీతాలతో జీవనం కొనసాగిస్తున్న అంగన్‌వాడీలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు అంబటి మణెమ్మ, సుగుణమ్మ, యాదమ్మ, వసుంధర, శాంతమ్మ, ఎల్లమ్మ, రజిత, ఫర్వీన్, శారత, అచ్చమ్మ, ప్రసన్న, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు శుక్రవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల పోరాటానికి ఎస్‌ఎఫ్‌ఐ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి కోరే రమేష్, చందు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు అంబటి మణెమ్మ, సుగుణమ్మ, రజిత, యాదమ్మ, శారద, విజయ, వసుంధర, నారాయణమ్మ ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఈ సమస్యలపై అంగన్‌వాడీలు కన్నెర్ర చేస్తే సీఎం కేసీఆర్ ప్రభుత్వం పతనం ఖాయమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాడీ రాజు, బీఎస్పీ ఉమ్మడి నల్లగొండ జిల్లా జోనల్ కన్వీనర్ ఇంద్రవెల్లి కవిత, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు బీఎస్పీ, సీపీఐ, సీపీఎం పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి, అంగన్‌వాడీల జేఏసీ నాయకురాళ్లు బొందు పార్వతి, బైరెడ్డి రాణి, సీహెచ్ సుజాత, వజ్రమ్మ, భాగ్యమ్మ, భవానీ, ప్రమీల, జూలకంటి మల్లేశ్వరీ, సంధ్య, లక్ష్మి, నాగమణి, నాగలక్ష్మి, బేగం, ఝాన్సీరాణి, సైదాబి, బీఎస్పీ నాయకులు గాలిబ్, సైదులు, కళ్యాణి, గౌతమ్, తదితరులున్నారు.

పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ముందు పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సమస్యలపై ఈనెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణంలోని డిపో ఎదుట శుక్రవారం ఆ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2017, 2021 పెండింగ్ పేస్కేల్‌ను వెంటనే అమలు చేయాలని, ఆర్‌ఎస్‌పీ-2013 ఏరియర్స్, బాండ్స్‌లను ఇప్పటి వరకు వడ్డీలతో సహా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, సీఐటీయూ జిల్లా నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి, తిరుపతి రాంమ్మూర్తి, లక్ష్మీనారాయణ, మిర్యాలగూడ డిపో ఆర్టీసీ జేఏసీ నాయకులు తాళ్లపల్లి వినయ్‌కుమార్, కెవీ రెడ్డి, బీజీ రావు ఉన్నారు.

గుర్రంపోడ్‌లో దొంగల హల్‌చల్

గుర్రంపోడ్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని వద్దిరెడ్డిగూడెం, శాంతినగర్ గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. శాంతినగర్‌లో వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంట్లో ద్విచక్రవాహనాన్ని అపహరించారు. వద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వద్దిరెడ్డి అంజిరెడ్డి ఇంట్లోని బీరువా తెరిచి అందులో ఉన్న రూ.4వేల నగదును దోచుకోవడంతో పాటు ఆయన భార్య శాంతమ్మ మెడలో ఉన్న బంగారు చైన్‌ను అపహరించే ప్రయత్నం చేయగా ఆమె కేకలు వేయడంతో పారిపోయారు. మండల కేంద్రంలో మేకల విజయ్‌రెడ్డికి చెందిన ఎలక్ట్రికల్ దుకాణం షెట్టర్ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ.40వేలను అపహరించారు. అలాగే కూన్‌రెడ్డి యాదయ్య ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి 20తులాల వెండి, అర తులం బంగారం దొంగిలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ శివప్రసాద్, క్లూం టీం పరిశీలించారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడ : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్–17 క్రీడా పోటీలు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. ఈ పోటీల్లో క్యారమ్స్‌లో ప్రథమ బహుమతి అప్పాజిపేట పాఠశాలకు చెందిన స్పందన, ద్వితీయ బహుమతి దేవరకొండ పాఠశాలకు చెందిన కె.ఇందు, చెస్‌లో ప్రథమ బహుమతి మోటుకొండూరు పాఠశాలకు చెందిన మధుప్రియ, ద్వితీయ బహుమతి చందుపట్ల పాఠశాలకు చెందిన సాయిజాహ్నవి, కబడ్డీ క్రీడల్లో దామరచర్ల– మునుగోడుకు చెందిన విద్యార్థులు సెమీఫైనల్‌కు చేరుకోగా వాలీబాల్ క్రీడల్లో సింగిరెడ్డిపాలెం, అనంతగిరి పాఠశాలలకు చెందిన విద్యార్థులు సెమీ ఫైనల్‌కు, ఖోఖో క్రీడల్లో మద్దిరాల, దేవరకొండ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నట్లు పీడీ ఇందిర, పీఈటీ శాంతి, ఉపాధ్యాయులు సరళ తెలిపారు. క్రీడల ముగింపు రోజు విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన రాంబాబునాయక్

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియామకమైన నేనావత్ రాంబాబునాయక్ శుక్రవారం జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డిని నల్లగొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంబాబునాయక్‌ను జెడ్పీ చైర్మన్ శాలువాతో సన్మానించారు.

కార్మికుల హామీలు అమలు చేయాలి



మిర్యాలగూడ అర్బన్ : నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, పాల్గొన్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో జెర్రిపోతుల ఎల్లమ్మ, కమలమ్మ, సరళ, వెంకాయమ్మ, సైదమ్మ, మదీనా, గోవిందమ్మ, అరుణ, నాగమణి, దేవమ్మ తదితరులున్నారు.

మిర్యాలగూడ : మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న కార్మికులు పాల్గొన్నారు.

దేవరకొండ : ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, జంగమ్మ, ఝాన్సీ, ధనలక్ష్మి, వెంకటయ్య, శోభారాణి, తదితరులున్నారు.

చింతపల్లి : ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాడ్గుల సైదులు, మల్లయ్య పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు భారతమ్మ, సుగునమ్మ, ధనలక్ష్మి, అలివేలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎస్‌ఐకి సన్మానం

త్రిపురారం : మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గాజుల ప్రమీల, ఎస్‌ఐగా వీరశేఖర్‌ను బీఆర్‌ఎస్ మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, మర్ల చంద్రారెడ్డి, నరేందర్, జయరాం, జానయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దుకాణం ఖాళీ చేయాలని బైఠాయింపు

మిర్యాలగూడ : తన సొంత మడిగెను కిరాయికి ఇవ్వగా కిరాయికి తీసుకున్న వ్యక్తి ఆక్రమించుకొని ఖాళీ చేయకుండా ఉండడాన్ని నిరసిస్తూ మడిగె యజమాని తెడ్ల లక్ష్మయ్య దంపతులు ఆ దుకాణం ఎదుట శుక్రవారం బైఠాయించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న షాపును ఏడు సంవత్సరాల క్రితం గౌరు వెంకటేశ్వర్లుకు అద్దెకు ఇచ్చామని, ఆ మడిగెలో విజయదుర్గ బట్టల దుకాణాన్ని పెట్టుకున్నారన్నారు. ఏడు సంవత్సరాల క్రితం తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, దుకాణం ఖాళీ చేస్తామని చెప్పి కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ పంపించినా ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఏడేళ్లుగా కేసు కోర్టులో ఉండడంతో వృద్ధ వయస్సులో తమ ఆరోగ్యం బాగోలేనందున పరిష్కారం ఆలస్యమవుతుందని భావించి షాపును వారు ఖాళీ చేయించేంత వరకు షాపులోనే భీష్మించు కూర్చోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆర్యవైశ్యుల సంఘం వారు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మాడుగులపల్లి : రైతులు పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సైదానాయక్ అన్నారు. మండలంలోని కన్నెకల్లు గ్రామంలో సాగు చేసిన పత్తి పైర్లను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. చేలలో వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు వేరుకుళ్లు, కాండం కుళ్లు, కాయకుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్కల అడుగు భాగంలో పిచికారీ చేయాలని సూచించారు. పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎస్పేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట పలువురు రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

మహిళా బిల్లు ప్రవేశపెట్టడం చరిత్రాత్మకం

దేవరకొండ : ప్రధాని మోదీ ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టడం చరిత్రాత్మకమని మీర్‌పేట్ బీజేపీ కార్పొరేటర్ నీలరవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. నారీ శక్తివందన్ బిల్లును తెచ్చిన ప్రధాని మోదీకి భారతదేశ మహిళల తరుపున ఆమె అభినందనలు తెలిపారు.

తిరుమలగిరిలో భారీ వర్షం



గాత్‌తండాలో వేరుశనగ పంటపై మేటవేసిన ఇసుక



గాత్‌తండాలో పత్తిచేనులో నిలిచిన వర్షపునీరు



తిరుమలగిరి వద్ద నీటమునిగిన వరిపంట



తిరుమలగిరిలో మిర్చి తోటలో నిలిచిన వర్షపునీరు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రాజవరం వాగు, తిరుమలగిరి బంధం శుక్రవారం ఉదయం ఉధృతంగా ప్రవహించాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు గ్రామాల్లో మిర్చి పంట నేలమట్టం కాగా, కొన్నిచోట్ల మొక్కలు కొట్టుకుపోయాయి. పత్తి పంటలో వర్షపు నీరు నిలిచింది. పదిహేను రోజుల తరువాత ఓ మోస్తరు వర్షం పడడంతో ఎండుతున్న పత్తి చేలకు ఊపిరి వచ్చినట్టు అయ్యిందని రైతులు అంటున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.